క్లుప్తంగా

యాత్రను విజయవంతం చేయండి



పెద్దకొత్తపల్లి: కొల్లాపూర్ నియోజకవర్గంలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పాదయాత్ర 30, 31వ తేదీలలో కొనసాగుతుందని కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని నియోజకవర్గ ఇన్‌చార్జ్ జగదీశ్వర్‌రావు అన్నారు. సోమవారం ఫాంహౌస్‌లో సమీక్ష నిర్వహించారు. మంగళవారం పాదయాత్ర కార్నర్ సమావేశం ఉంటుందన్నారు.

ప్రజావాణికి ఫిర్యాదులు నిల్

చారకొండ: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి ఫిర్యాదులు అందలేదని తహసీల్దార్ శ్రీనివాస్ రావు తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి అధికారులు విధిగా హాజరుకావాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి సమస్యలను ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే, సంబంధిత అధికారులతో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రశీదా, ఏపీఎం బాలచందర్, పశువైద్యాధికారి మదర్ తదితరులు ఉన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ

తాడూరు: మండల కేంద్రంతో పాటు మేడిపూర్, గుంతకోడూరులో ఏఓ సాయికుమార్ శనివారం ఎస్‌ఐ శ్రీనివాసులుతో కలిసి ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. అన్ని రకాల రిజిస్టర్లు, షాపులో ఉండాల్సిన నిల్వలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలన్నారు. నకిలీ విత్తనాలు బీటీ–3 విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ఆత్మీయ సమ్మేళనానికి తరలిరండి

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించే బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మండల అధ్యక్షుడు గణేష్‌రావు పిలుపునిచ్చారు. సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రులు హరీష్‌రావు, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ చల్లా వెంకటరామిరెడ్డి, ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి హాజరవుతున్నారు.

రూ.3.49 కోట్లతో అభివృద్ధి పనులు

మన్ననూర్: అమ్రాబాద్ మండలంలోని మన్ననూర్, ప్రశాంతినగర్ గ్రామాల్లో ప్రభుత్వం కేటాయించిన రూ.3.49 కోట్ల నిధులతో చేపట్టనున్న అభివృద్ధి పనులను మంత్రి హరీష్‌రావు మంగళవారం ప్రారంభించనున్నట్లు సర్పంచ్ నేనావత్ శ్రీరాం తెలిపారు. మన్ననూర్ చర్చి నుంచి ప్రశాంతి నగర్ వరకు సుమారు 2 కిలో మీటర్లు బీటీ రోడ్డు, మన్ననూర్‌లో మసీద్, బస్టాండ్, వేణుగోపాలస్వామి, ముదిరాజ్ గంగమ్మ దేవత ఆలయంకు నిధులు కేటాయించినట్లు తెలిపారు.

ఈఎస్‌ఐ అమలు చేయాలని వినతి

కల్వకుర్తి: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు ఈఎస్‌ఐ అమలు చేయాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు సోమవారం కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్మికులకు పీఎఫ్, ఈఎస్‌ఐ డబ్బులు ప్రతి నెల వేతనంలో కోత విధిస్తున్నా ఆరోగ్య సమస్యలు వచ్చినప్పుడు ఎక్కడ చూయించుకోవాలో అర్థం కావడం లేదని అన్నారు. కార్మికులకు ఈఎస్‌ఐ హాస్పిటల్ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, చంద్రయ్య, శేఖర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ భవనానికి అంబేడ్కర్ పేరు పెట్టాలి

చారకొండ: కొత్తగా నిర్మించిన పార్లమెంట్ భవనానికి అంబద్కర్ పేరు పెట్టాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మట్లాడారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లే తెలంగాణ వచ్చిందని అన్నారు. అంబేద్కర్ బాటలో వ్యవస్థ నడుస్తుందని తెలిపారు. అంబేద్కర్‌ను గుర్తించి సముచిత గౌరవాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ 125 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. రామకృష్ణ, సర్పంచ్‌లు ప్రశాంత్ నాయక్, శ్రీను, ఉప సర్పంచ్ శ్రీను ఉన్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తికి గాయాలు

లింగాల: ద్విచక్రవాహనం అదుపు తప్పి వ్యక్తి గాయాలైన సంఘటన సోమవారం మండలంలో చోటు చేసుకుంది. సూరాపూర్‌కు చెందిన గుండాల బాలస్వామి లింగాల నుంచి సూరాపూర్‌కు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. అటుగా వస్తున్న ఆర్టీసీ బస్సు అదుపు తప్పిన ద్విచక్రవాహనాన్ని గమనించిన డ్రైవర్ బస్సును చాకచక్యంగా రోడ్డు పక్కకు తిప్పడంతో ప్రాణాపాయం తప్పిందని సంఘటన చూసిన వారు తెలిపారు.

ఉత్సవాలకు ముస్తాబైన ఆలయాలు

ఉప్పునుంతల: మండల కేంద్రంతోపాటు శివారు గ్రామాలైన గట్టుకాడిపల్లి, కొత్త రాంనగర్‌లో మంగళవారం నుంచి జూన్ 2వ తేదీ వరకు బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. మంగళవారం పూజలు, బుధవారం పూజలు, హోమం, జూన్ 1వ తేదీన గురువారం మండల కేంద్రంలోని కేదారేశ్వర ఆలయంలో ధ్వజ స్తంభాలు, నవగ్రహాల ప్రతిష్ఠాపన, పోచమ్మ అమ్మవారి విగ్రహ పునప్రతిష్ఠాపన, వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహాలు, కొత్తరాంనగర్‌లో పోచమ్మ, ఆంజనేయ స్వామి కొత్త విగ్రహాల ప్రతిష్ఠానలతోపాటు బొడ్రాయి, గట్టుకాడిపల్లిలో బొడ్రాయి ప్రతిష్ఠాపనలు, బోనాలు ఉంటాయని తెలిపారు. అదే రోజు రాత్రి 8 గంటలకు పాలిచుట్టు, రాత్రి 10 గంటలకు కోట మైసమ్మకు పూజలు, జూన్ 2న శుక్రవారం ఉదయం పొత్తి తొలగింపు ఉంటుందని పేర్కొన్నారు.

నేటి నుంచి ప్రతిష్ఠాపన ఉత్సవాలు

లింగాల: మండల కేంద్రంలోని పద్మన్నపల్లిలో 30 నుంచి జూన్ 1వ తేదీ వరకు అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనకు నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. అభయాంజనేయస్వామి విగ్రహంతో పాటు కాశీవిశ్వేశ్వరుడు, నందీశ్వరుని విగ్రహాలను ప్రతిష్ఠించనున్నారు. 30న ఉదయం 9 గంటలకు గణపతి పూజ, పుణ్యావాచకం, కలశ పూజ, కంకణధారణతో ఉత్సవాలు మొదలవుతాయని, సాయంత్రం విగ్రహాల ఊరేగింపు ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 31న సామూహిక నవగ్రహ శాంతి హోమాలు, విశేష పూజలు, జూన్ 1వ తేదీన ఉదయం యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ తదితర దైవ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



మంచాలకట్టలో ముస్తాబైన అభయాంజనేయ స్వామి ఆలయం

నేటి నుంచి ఆంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు

పెంట్లవెల్లి: మండలంలోని మంచాలకట్టలో మంగళవారం నుంచి జూన్ 1వ తేదీ వరకు అభయాంజనేయ స్వామి, సీతారామలక్ష్మణ బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయధర్మకర్త విజయ్ తెలిపారు. 30వ తేదీ గణపతి పూజతో ప్రారంభమై, 31న ఆవాహిత దేవత పూజలు, హోమాలు, ప్రత్యేక పూజా కార్యక్రమాలు, 1న సీతారామచంద్ర స్వామి కల్యాణోత్సవం ఉంటాయని తెలిపారు. భక్తులకు అన్ని వసతులు ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఘనంగా బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠ

వెల్దండ: మండలంలోని అజిలాపూర్‌లో సోమవారం బొడ్రాయి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ హాజరై బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ భక్తిభావంతో మెలగాలన్నారు. గ్రామ దేవతలను పూజించడంతో గ్రామాన్ని ఎల్లప్పుడు కాపాడుతాయన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

కల్వకుర్తిరూరల్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ మనోహర సూచించారు. సోమవారం మండలంలోని రఘుపతిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో జన ఆరోగ్య సమితి సమావేశం నిర్వహించారు. ఆస్పత్రిలో సిబ్బందితో వివరాలు సేకరించి రికార్డులను పరిశీలించారు. అభివృద్ధి పనులకు తీర్మానాలు చేశారు. ప్రభుత్వం పేద ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎంపీపీ తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎం హెచ్‌ఓ భీమమ్మ, ఎంపీడీఓ ఆంజనేయులు, డాక్టర్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైద్యాధికారులు

పోస్టుమార్టం రిపోర్టు బయట పెట్టాలి

అమ్రాబాద్: పదర మండలం వంకేశ్వరం చెందిన నిఖిత పోస్టుమార్టం రిపోర్టును బయట పెట్టాలని ఎంఎస్‌ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు పవన్ సోమవారం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. నిఖిత చనిపోయి 3నెలలు అవుతున్నా ఇప్పటి వరకు హత్యనా? ఆత్మహత్యనా తేల్చకపోవడం బాధాకరమన్నారు. బాలిక కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే ఇప్పటి వరకు న్యాయం చేయలేదని ఆరోపించారు. కుటుంబానికి రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మన్ననూర్: మన్ననూర్‌లోని గురుకుల పాఠశాలలో అనుమానాస్పదంగా మృతి చెందిన నిఖిత రీపోస్టుమార్టం వివరాలు బయట పెట్టి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని లేని పక్షంలో రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు పర్యటనను అడ్డుకుంటామని ఎంఎస్‌ఎఫ్ మండల కార్యదర్శి అంజి సోమవారం హెచ్చరించారు. రెండు నెలలు గడిచిపోయినా హత్యా, ఆత్మహత్యా తెలియజేయకపోవడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు.

గ్రామాభివృద్ధికి సహకరిస్తాం



తోటపల్లిలో పర్యటిస్తున్న రాఘవేందర్‌రెడ్డి

కల్వకుర్తిరూరల్: గ్రామాభివృద్ధికి సహకారం అందిస్తానని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని తోటపల్లిలో పర్యటించారు. అనారోగ్యం బారిన పడిన పలువురి కుటుంబాలను పరామర్శించి అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. గ్రామస్తులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, సాంబశివుడు, పాష, కృష్ణారెడ్డి, గంగాధర్, శేఖరయ్య, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపికైన మాస్టర్ కిరణ్‌నాయక్‌ను ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి సోమవారం ఐక్యతా కార్యాలయ ఆవరణలో సన్మానించారు.

కోటమైసమ్మ దేవాలయానికి భూమి పూజ

వెల్దండ: మండలంలోని చెర్కూర్‌లో కోట మైసమ్మ దేవాలయ నిర్మాణానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించారు.

నాసిరకంగా బీటీరోడ్డు పనులు



దెబ్బతిన్న బీటీని చూపిస్తున్న గ్రామస్తులు

బల్మూర్: వారం కాకముందే బీటీ రోడ్డు దెబ్బతినందని మండలంలోని బాణాల గ్రామ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని కొండనాగుల నుంచి బాణాల వరకు ఐదు కిలో మీటర్ల పొడవున బీటి రోడ్డు పనులకు రూ.1.30కోట్లు మంజూరయ్యాయి. పది రోజుల నుంచి కాంట్రాక్టర్ పనులు ప్రారంభించగా అధికారుల పర్యవేక్షణ లోపంతో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడంతో బీటీ దెబ్బతినిందని వారు ఆరోపిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేసి కాంట్రాక్టర్‌తో పాటు అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

ఉపాధి పనుల్లో జాగ్రత్తలు పాటించాలి



అమ్రాబాద్‌లో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామ్మోహన్

మన్ననూర్: ప్రస్తుతం ఉష్ణోగ్రతలు అధికంగా ఉన్నందున ఉపాధి పనులకు వస్తున్న కూలీల ఆరోగ్యంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అమ్రాబాద్ ఎంపీడీఓ రామ్మోహన్ సిబ్బందికి సూచించారు. సోమవారం అమ్రాబాద్ మండలం మాచారంలో ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. పథకం పనుల నిర్వహణ గురించి టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లతో పాటు మేటీలను అడిగి తెలుసుకున్నారు. కూలీలతో మాట్లాడుతూ తాగునీరు, టెంటు నీడ, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు నిర్వాహకులు అందుబాటులో ఉంచుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజు కొంత ఉదయాన్నే పనులకు వచ్చి ఎండ కాగానే పనులు ముగించుకుని ఇళ్లకు వెళ్లాలని కూలీలకు సూచించారు. గ్రామంలోని వన నర్సరీలో పెంచుతున్న మొక్కలు వచ్చే హరిత హారం నాటికి సిద్ధం చేయాలని కార్యదర్శికి సూచించారు. షెడ్‌లో తయారు చేస్తున్న వర్మీ కాంపోస్టును పరిశీలించారు. ఆయన వెంట ఎంపీఓ వెంకటయ్య, కార్యదర్శి ముచ్చం తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం ప్రకారం మొక్కలు పెంచాలి

చారకొండ: గ్రామాల్లో ప్రతి నర్సరీకి మొక్కల పెంపకంపై లక్ష్యం విధించామని, ప్రతి నర్సరీల్లో అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ జయసుధ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం ఎంపీడీఓ నర్సరీని పరిశీలించారు. నర్సరీలో మొక్కల పెంపకం తదితర వాటిపై వివరాలను తెలుసుకున్నారు.

కంటి వైద్య శిబిరం



లింగాల: జిల్లా అంధత్వ నియంత్రణ సంస్థ, జిల్లా వైద్య శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సోమవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నేత్ర వైద్యాధికారులు గణేష్, వెంకటేష్, యుగంధర్ 70 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 45 మందికి కంటిలో శుక్లాలు ఉన్నట్లు గుర్తించారు. ఆపరేషన్ కోసం వారిని హైదరాబాద్ తరలించారు.

పీఆర్సీ అమలు చేయాలి

నాగర్‌కర్నూల్ రూరల్: రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ పనిచేస్తున్న కార్మికులకు వెంటనే 30శాతం పీఆర్‌సీ అమలు చేయాలని పంచాయతీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ధర్నా నిర్వహించి ఎంపీడీఓ కోటేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, రామకృష్ణ మాట్లాడుతూ 9 మాసాల క్రితం రాష్ట్రంలో అన్ని రంగాల కార్మికులకు పీఆర్సీ వర్తింపచేసిన ముఖ్యమంత్రి పంచాయతీ కార్మికులకు అమలు చేయకపోవడం కార్మికుల కష్టాన్ని కాలరాయడమేనని ఆరోపించారు. కేవలం రూ.వెయ్యి వేతనం పెంచడం సరికాదన్నారు. తక్షణం వారికి రూ.26 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.



పంచాయతీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

పెంచిన వేతనాలు ఇవ్వాలని నిరసన

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వం పెంచిన కొత్త జీతాల అమలు చేయాలని సోమవారం నిరసన తెలిపారు. పెంచిన కొత్త జీతాలు అమలు అవుతూ 11 నెలలు గడుస్తున్నా జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మాత్రం పెంచిన కొత్త వేతనాలు ఇవ్వడం లేదని మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ ఆరోపించారు. కొందరు గుత్తెదారులు కోర్టుల్లో కేసులు వేశారనే సాకుతో జిల్లా అధికార యంత్రాంగం కార్మికులకు కొత్త వేతనాలు అమలు చేయడం లేదన్నారు. 2017 టెండర్ ప్రకారం అప్పటి ఆస్పత్రి సామర్థ్యానికి ఆధారంగా తీసుకున్న కార్మికుల సంఖ్యనే నేటికి ఉందని, ప్రస్తుత పరిస్థితి ని అనుసరించి తక్షణం కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో శివశంకర్, అజ్మీర, మణెమ్మ, గౌరమ్మ, రేణుక, అలివేల, జ్యోతి, మహేశ్వరి, వెంకటమ్మ, బాలకృష్ణ, గిరి, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.



ఆస్పత్రి ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

రేపు మండల సర్వసభ్య సమావేశం

అమ్రాబాద్: మండల సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ శ్రీనివాసులు, ఎంపీడీఓ రామ్మోహన్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ మీటింగ్‌హాలులో మధ్యాహ్నం 1గంటలకు సమావేశం ఉంటుందని ప్రజాప్రతినిధులు హాజరుకావాలని తెలిపారు. అన్ని శాఖల అధికారులు పూర్తి వివరాలతో సమావేశానికి రావాలని పేర్కొన్నారు.

సంఘం అభివృద్ధికి ఐక్యంగా పోరాడాలి

తాడూరు: మత్స్యకార సంఘం అభివృద్ధి చెందాలంటే ఐక్యంగా పోరాడాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు యార రమేష్ అన్నారు. సోమవారం సాయంత్రం మండల కేంద్రంలో మత్స్యకార సంఘం ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. చెరువు సంఘం కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం మత్స్యకార సహకార సంఘం మండల కమిటీని ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా శ్రీనివాసులు, ఉపాధ్యక్షులుగా లక్ష్మయ్య, అశోక్, ప్రధాన కార్యదర్శిగా బొందయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.



అధ్యక్షుడిని సన్మానిస్తున్న సంఘం సభ్యులు

బీఎస్పీ కమిటీ ఎన్నిక

కొల్లాపూర్: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి కల్యాణ మండపంలో సోమవారం బీఎస్పీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. అనంతరం నియోజకవర్గ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కాటం విష్ణుతేజ, ప్రధాన కార్యదర్శిగా ప్రకాష్, కార్యదర్శిగా బి.దాసు, కోశాధికారిగా ఎల్లపోగు విష్ణులను నియమించినట్లు జిల్లా అధ్యక్షులు కారంగి బ్రహ్మయ్య తెలిపారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోండి

తాడూరు: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కమ్యూనిటీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాల ఆవరణలో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని డీఎల్‌పీఓ రామ్మోహన్, ఎంపీడీఓ గంగమోహన్ సూచించారు. సోమవారం మండలంలోని సిర్సవాడలో పాఠశాల ఆవరణలో ఇంకుడు గుంతల నిర్మాణానికి ముగ్గువేశారు. ఇంకుడు గుంతల నిర్మాణం వల్ల పాఠశాల ఆవరణ అంతా మొక్కలతో పచ్చని వాతావరణంతో ఉంటుందని, భూగర్భ జలాలు పెరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, ఎంపీఓ లక్ష్మణ్ నాయక్, కార్యదర్శులు ఉన్నారు.



ఇంకుడు గుంతల నిర్మాణానికి ముగ్గు వేస్తున్న ఉపాధి సిబ్బంది

వేడుకల్లో భాగస్వాములు కావాలి

లింగాల: రాష్ట్ర అవతరణ దినోత్సవంలో అందరూ భాగస్వాములు కావాలని ఎంపీడీఓ గీతాంజలి మహిళా సంఘాలను సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో గ్రామ సంఘాల మహిళలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ. జూన్ 2 నుంచి 22వ తేదీ వరకు 20 రోజుల పాటు ఆవిర్భావ వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని తెలిపారు. ఒక్కో రోజు ఒక అంశంపై అన్ని శాఖల సమన్వయంతో కార్యక్రమంటా ఉంటాయన్నారు. కార్యక్రమంలో డీపీఎం శ్రీనివాసులు, ఏపీఎం బాలస్వామి, వనజ, శంకర్‌లాల్, చందులాల్, దేవన్న పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీడీఓ గీతాంజలి

రికార్డులు సక్రమంగా ఉండాలి



బైరాపూర్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ పండరీనాథ్

వెల్దండ: పంచాయతీలో వినియోగించే రికార్డులను సక్రమంగా ఉండేలా చూడాలని డీఎల్‌పీఓ పండరినాథ్ సూచించారు. సోమవారం మండలంలోని బైరాపూర్, నగారగడ్డతండా, చెదురుపల్లిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో ఉంచే ప్రతి రికార్డు పూర్తి చేసి ఉంచాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పనులకు వెళ్తున్న కూలీలకు వేసవిలో వసతులను సమకూర్చాలన్నారు. ఉదయం వేళల్లో త్వరగా పనులకు వెళ్లి కొలతల ప్రకారం పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో కూలీల సంఖ్యను పెంచాలన్నారు. ప్రతి వారం మస్టర్లను సక్రమంగా పూర్తి చేసి ఆన్‌లైన్ చేస్తేను కూలీలకు సకాలంలో డబ్బులు అందుతాయన్నారు. కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందించాలని తెలిపారు.

భూమిని కాపాడాలని వినతి

తాడూరు: మండలంలోని తుమ్మలసూగూరులోని ఊర చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో కొంతమంది రైతులు కబ్జా చేస్తున్నారని సోమవారం జిల్లా నీటి పారుదల అధికారి, కలెక్టర్, ఆర్డీఓలకు వేర్వేరుగా గ్రామానికి చెందిన మత్స్య ప్రాథమిక సంఘం సభ్యులు భాస్కర్, వెంకటయ్య, రాము, శివ వినతి పత్రాలు అందజేశారు. గ్రామానికి చెందిన చిన్నారెడ్డి 4.5 ఎకరాల భూమిలో 6 ఫీట్ల వరకు మట్టి పోసి ఎత్తు పెంచుకోవడంతో పాటు శికం భూమిని కూడా కబ్జా చేస్తున్నారని తెలిపారు. అధికారులు చెరువు పరిధిని పరిశీలించి ఎఫ్‌టీఎల్ పరిధిని కాపాడాలని వారు కోరారు.

సైబర్‌నేరాల నివారణపై అవగాహన



బస్సులో అవగాహన కల్పిస్తున్న షీ టీం సిబ్బంది

అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో, బస్సులలో షీ టీం ఆధ్వర్యంలో సైబర్ నేరాల నివారణ, రోడ్డు నియమ నిబంధనలు, షీ టీం, నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. కళాబృందంచే నకిలీ విత్తనాలను ఎలా గుర్తుపట్టాలని వివరించారు. కార్యక్రమంలో సిబ్బంది ఇందిరా, వెంకట్‌నాయక్, పాండు పాల్గొన్నారు.

నార్లాపూర్‌లో ముగ్గురికి కుక్కకాటు

కొల్లాపూర్: మండలంలోని నార్లాపూర్‌లో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు కుక్కకాటుకు గురయ్యారు. మూరకొండ బిచ్చన్న, చిన్నారులు అంకిత, లక్కీ ఇంటివద్ద ఉండగా వారిపై వీధికుక్క దాడి చేసింది. గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం వారు నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీధికుక్కల నివారణకు అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

వాకర్స్‌కు వైద్య పరీక్షలు



అచ్చంపేట రూరల్: పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో సోమవారం వాకర్స్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు. పదర వైద్యుడు గౌతమ్, ప్రైవేట్ ఆస్పత్రి వైద్యుడు లింగాచారి బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. వాకింగ్ చేయడం ద్వారా అనేక లాభాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ వాకింగ్, యోగా, వ్యాయామం చేయాలని వైద్యులు సూచించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు చందునాయక్, జీహెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ రమేష్‌నాయక్, శ్రీనివాస్‌గౌడ్, ఆంజనేయులు, నర్సోజీ, రూప్లనాయక్ తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలాకం ధ్వంసంపై కేసు నమోదు

అచ్చంపేట రూరల్: పట్టణంలోని మల్లంకుంట సమీపంలో అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వ్యక్తిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం మంత్రి హరీష్‌రావు చేతుల మీదుగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నారు. సోమవారం శిలాఫలకం ధ్వంసంపై మున్సిపల్ కమిషనర్ బలరాంనాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు.

మద్దతు ధర లేక తీవ్ర అన్యాయం

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రభుత్వం యాసంగి సీజన్‌లో రైతులు పండించిన వరిధాన్యాన్ని ప్రకటించిన మద్దతు ధర కొనుగోలు చేయకుండా తీవ్ర నష్టానికి గురి చేస్తున్నారని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటయ్య ఆరోపించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్‌ను సందర్శించి రైతులు తెచ్చిన ధాన్యాన్ని పరిశీలించారు. క్వింటాల్‌కు రూ.1,420 నుంచి రూ.1,470 మధ్యన కొనుగోలు చేస్తున్నారని ఫలితంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆరోపించారు. మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మాత్రం రైతులు పండించిన తడిసిన, మొలకెత్తిన ధాన్యానికి రూ.2,060 మద్దతు ధర ఇస్తామని కబుర్లు చెబుతున్నారే తప్పా కొనుగోలు చేయడం లేదన్నారు. తక్షణం రైతుల ధాన్యానికి మద్దతు ధర ఇవ్వకపోతే ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కేశవులుగౌడ్, శివశంకర్, ఆంజనేయులు, గణేష్, ఆంజనేయులు, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మార్కెట్‌లో ధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతు సంఘం నాయకులు

గురుకుల ప్రవేశ పరీక్ష ఫలితాల్లో విద్యార్థుల సత్తా

ఉప్పునుంతల: స్థానిక బాలుర ప్రాథమిక పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు సోమవారం వెలుబడిన గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్షలో సత్తా చాటారు. పాఠశాలకు చెందిన తారక, ప్రజ్వ, ప్రణవి, సింధు, హిమవర్షిణి, స్వప్న, తేజ్‌కుమార్, అరవింద్ గురుకుల విద్యాలయాలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం లక్ష్మీనారాయణ తెలిపారు. విద్యార్థులు గురుకుల విద్యాలయాలకు ఎంపిక కావడానికి కృషిచేసిన హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు వెంకటేష్, బాలమణిని పలువురు అభినందించారు.

వీఓఏల ముందస్తు అరెస్ట్

ఉప్పునుంతల: ఐకేపీ వీఓఏలు చేస్తున్న సమ్మెలో భాగంగా సోమవారం హైదరాబాద్ ఇందిరాపార్కు వద్ద తలపెట్టిన ధర్నాలో పాల్గొనడానికి వెళ్తున్న వీఓఏలను ఉదయం ముందస్తుగా అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ తెలిపారు. అదుపులోకి తీసుకున్న వీఓఏలు బాలస్వామితోపాటు మరో నలుగురిని అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేసినట్లు తెలిపారు.

హైదరాబాద్ తరలిన వీఓఏలు

తెలకపల్లి: సమస్యలు పరిష్కరించాలని వీఓఏలు చేస్తున్న సమ్మె సోమవారానికి 43వ రోజుకు చేరింది. సోమవారం హైదరాబాద్‌లోని నిరసన కార్యక్రమానికి తరలివెళ్లారు. ప్రభుత్వం వీఓఏల సమ్మెను పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తుందని సీపీఎం నాయకుడు లక్ష్మణ్ అన్నారు. 18 ఏళ్లుగా గ్రామాలలో మహిళా సంఘాలకు పలు సేవలు అందించడమే కాకుండా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్న వీఓఏల సమస్యలు పరిష్కరించకుండా ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. సమ్మెను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అన్నారు.

వెల్దండ: మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వీఓఏలను సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు హైదరాబాద్‌లోని ధర్నాకు వెళ్లకుండా ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్టయిన వారిలో జంగమ్మ, అలివేలు, మహిపాల్, అల్లాజీ తదితరులు ఉన్నారు.